మహిళా మార్టు నగదు ఏమైందో?

- గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు
- ప్రారంభంలో నెలకు రూ.20లక్షల వరకు లావాదేవీలు
- ఆ తరువాత లావాదేవీల్లో అవినీతి చోటు
- జూలై నుంచి మూసివేత
- గత నెలలో సెర్ప్ ఆదేశాలతో ఆడిటింగ్
- ఇప్పటి వరకు బహిర్గతం చేయని అధికారులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు



వింజమూరులోని మహిళా మార్టు (ఫైల్)

వింజమూరు(ఉదయగిరి): గత ప్రభుత్వ హయాంలో వింజమూరులో ప్రతిష్టాత్మకంగా మహిళా మార్టును ఏర్పాటు చేశారు. ప్రారంభంలో లాభాల బాటలో నడిచిన మార్టులో ఆ తరువాత అవినీతి చోటు చేసుకుంది. క్రమంగా నష్టాల బాట పట్టింది. మహిళా సంఘాల సభ్యుల ఫిర్యాదుతో విచారణ జరిపిన జిల్లా అధికారులు ఏపీఓను సస్పెండ్ చేసి మార్టును మూసివేశారు. గత నెలలో సెర్ప్ ఉన్నతాధికారుల ఆదేశాలతో మార్టు లావాదేవీలపై జిల్లా అధికారులు ఆడిటింగ్ చేపట్టారు. అయితే ఇప్పటి వరకు వివరాలను బహిర్గతం చేయకపోవడంతో తమ పెట్టుబడి నగదు ఏమైందోనని మహిళా సంఘాల సభ్యులు ఆవేదన చెందుతున్నారు.

2023 మేలో ప్రారంభం

జిల్లాలో తొలుత కందుకూరులో మహిళా మార్టును ఏర్పాటు చేశారు. ఆ తరువాత 2023 మేలో వింజమూరులో రెండో మార్టును ప్రారంభించారు. బంగ్లా సెంటర్‌లో హైవే పక్కన ఏర్పాటు చేసిన ఈ మార్టు మొదట్లో బాగానే జరిగింది. ఆ తరువాత వెలుగు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో మూతపడింది.

రూ.16.25లక్షల పెట్టుబడితో..

వింజమూరు మండలంలో 863 మహిళా సంఘాలు ఉండగా, అందులో 8,654 మంది సభ్యులు ఉన్నారు. వీరందరూ కలిసి రూ.16.25 లక్షల పెట్టుబడితో మార్టును ప్రారంభించారు. సంఘ సభ్యులు ఒక్కొక్కరి నుంచి రూ.200 చొప్పున సేకరించి పెట్టుబడిగా పెట్టారు. మార్టు నిర్వహణకు 11 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. మార్టు నిర్వహణ బాధ్యతను అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులకు అప్పగించారు. ఈ మొత్తం వ్యవహారంపై వెలుగు ఏపీఎం పర్యవేక్షణ ఉంటుంది. ప్రారంభంలో మార్టులో రోజుకు రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు సరుకుల విక్రయాలు జరిగేవి. నాణ్యమైన సరుకుల సరఫరా, బహిరంగ మార్కెట్‌లో కంటే ధరలు తక్కువగా ఉండడంతో ఎక్కువ మంది సంఘ సభ్యులు తమ కుటుంబ అవసరాల కోసం మార్టు నుంచే కొనుగోలు చేసేవారు. మార్టు ప్రారంభించిన అనతికాలంలోనే మంచి పేరు రావడంతో మహిళా సంఘాలే కాకుండా బయటి వినియోగదారులు కూడా తమకు అవసరమైన సరుకులను కొనుగోలు చేయడంతో రోజువారీ వ్యాపారం బాగా పుంజుకుంది. నెలకు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు వ్యాపారం జరగడంతో లాభాలు కూడా బాగానే వచ్చాయి. దీనికితోడు ఆరుగురు మహిళలకు మార్టులో ఉపాధి కూడా లభించింది. మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులను కూడా మార్టు ద్వారానే విక్రయించేవారు.

అవినీతి, అక్రమాలతో..

మహిళా మార్టులో వ్యాపారం బాగా జరుగుతున్న సమయంలో అవినీతి చోటు చేసుకుని నాణ్యత లేని సరుకులను విక్రయించడంతో వ్యాపారం కొంత మేర తగ్గింది. దీంతో సెర్ప్ అధికారులు వ్యాపారాన్ని పెంచే నిమిత్తం మహిళా సంఘాలు విధిగా సరుకులు కొనుగోలు చేయాలని ఒత్తిడి తెచ్చారు. దీంతో ఈఓఏలు తమ పరిధిలోని సంఘాలకు టార్గెట్‌లు పెట్టారు. దీంతో బహిరంగ మార్కెట్ కన్నా అధిక ధరలు ఉన్న నాణ్యత లేని సరుకులు తమకు అవసరం లేదని పలు సంఘాల్లోని సభ్యులు తేల్చిచెప్పారు. అయినా సరుకులు కొనుగోలు చేయాల్సిందేనని అధికారులు ఒత్తిడి తేవడంతో పలు సంఘాల సభ్యులు మార్టు వద్ద నిరసనకు దిగారు. దీంతో మహిళామార్టులో చోటు చేసుకున్న అవకతవకలు బహిర్గతమయ్యాయి. మహిళా సంఘాల సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపి అప్పటి ఏపీఎంను సస్పెండ్ చేశారు. ఆ తర్వాత వచ్చిన అధికారులు మార్టు గురించి పట్టించుకోకపోవడంతో క్రమేణా నష్టాల ఊబిలో కూరుకుపోయింది. మార్టు యజమానికి బాడుగ చెల్లించలేని పరిస్థితిలో జూలై నెల నుంచి శాశ్వతంగా మూసివేశారు. గత నెలలో మహిళా మార్టును తిరిగి ప్రారంభించాలని రాష్ట్రస్థాయి సెర్ప్ అధికారులు ఆదేశాలు ఇవ్వడంతో జిల్లా అధికారులు ఆడిటింగ్ చేపట్టారు. ఇప్పటి వరకు ఆడిటింగ్ వివరాలను అధికారులు బహిరంగంగా వెల్లడించలేదు. మహిళా సంఘాలు పెట్టిన పెట్టుబడి, దాని ద్వారా మొదట్లో వచ్చిన లాభాలు ఇంత వరకు సంఘాలకు పంపిణీ చేయలేదు. ఈ మొత్తం నగదు ఏమైందో ఇంత వరకు వెలుగు అధికారులు బహిరంగపరచకపోవడంపై మహిళా సంఘాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి ఏపీఎం కృష్ణారావును వివరణ కోరగా త్వరలో మహిళా మార్టును తిరిగి ప్రారంభించే యోచనలో జిల్లా అధికారులు ఉన్నట్లు చెప్పారు. జిల్లా అధికారుల ఆదేశాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

క్లుప్తంగా

గురుకులంలో వైద్యశిబిరం



సంగం: స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. నలుగురు విద్యార్థినులు జ్వరాలతో బాధపడుతుండగా ప్రిన్సిపల్ సుమతి సంగం పీహెచ్‌సీకి పంపి వైద్యపరీక్షలు చేయించారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి గురుకులంలో వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థినుల రక్తనమూనాలను సేకరించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. విద్యార్థినులు సాధారణ జ్వరాలతో బాధపడుతున్నారని, ఎలాంటి విషజ్వరాలు లేవని డాక్టర్ తెలిపారు. విద్యార్థినులు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు. సంగం–3 పంచాయతీ కార్యదర్శి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పశుగణనకు రైతులు సహకరించాలి

వరికుంటపాడు: మండలంలో పశువైద్య సిబ్బంది చేపడుతున్న పశుగణనకు రైతులు సహకరించాలని పెద్దిరెడ్డిపల్లె పశువైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్రశర్మ కోరారు సోమవారం ఆయన పెద్దిరెడ్డిపల్లె వైద్యశాల పరిధిలో జరుగుతున్న పశుగణన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 8,347 గృహాలు ఉండగా, ఇప్పటి వరకు 3,800 గృహాలను పశువైద్య సిబ్బంది సందర్శించి పశుగణన చేపట్టినట్లు తెలిపారు. 45 శాతం పశుగణన పూర్తయిందని వివరించారు.

అపార్‌ను నూరు శాతం పూర్తి చేయాలి

వరికుంటపాడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సంబంధించి అపార్ నమోదును నూరుశాతం పూర్తి చేయాలని ఎంఈఓ–2 సీహెచ్ రమణయ్య ఆదేశించారు. మండలంలోని వెంగమాంబపురం ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందజేయాలని సూచించారు. మండలంలో ఇప్పటి వరకు అపార్ నమోదు 83శాతం పూర్తయిందని తెలిపారు. నూరు శాతం సాధించేందుకు హెచ్‌ఎంలు కృషి చేయాలన్నారు.

వేదగర్భలో రైతు దినోత్సవం



సీతారామపురం: స్థానిక వేదగర్భ పాఠశాలలో జాతీయ రైతు దినోత్సవ వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ దేశానికి రైతులు వెన్నెముకని తెలిపారు. సమాజంలో రైతుల పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులను పొలంబాట పట్టించి పంటల సాగుపై అవగాహన కల్పించారు.

104 వాహన సేవలు

వరికుంటపాడు: మండలంలోని ఎర్రంరెడ్డిపల్లెలో సోమవారం 104 వాహన సేవలను అందజేశారు. వైద్యాధికారిని ఆయేషా 22 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. గర్భిణులు ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు చేయించుకుని ప్రోత్సాహకాలు పొందాలని సూచించారు.

ముగ్గురు వీఏఏల బదిలీ

సీతారామపురం : మండలానికి చెందిన ముగ్గురు గ్రామ వ్యవసాయ సహాయకులను ఈ క్రాప్ నమోదు కోసం జలదంకి, కావలి మండలాలకు డిప్యుటేషన్‌పై బదిలీ చేస్తూ జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయని ఏఓ చెన్నారెడ్డి సోమవారం తెలిపారు. బసినేనిపల్లి వీఏఏ సబీనాను కావలి మండలం కొత్తపల్లి, మారంరెడ్డిపల్లి వీఏఏ లక్ష్మీనారాయణను జలదంకి మండలం అన్నవరం, సీతారామపురం బిట్–2 వీఏఏ హాజీరాబేగాన్ని జలదంకి–1కు బదిలీ చేసినట్లు చెప్పారు. వీరిని త్వరలో రిలీవ్ చేయనున్నట్లు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన 11 మంది బాధితులకు సీఎం సహాయనిధి నుంచి రూ.11.18లక్షల నగదు సాయం మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కులను నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బాధితులకు సోమవారం అందజేశారు.

‘వెలిగొండ’ సాధనకు రౌండ్‌టేబుల్ సమావేశం

ఉదయగిరి: వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఎంతో కీలకమైన వెలిగొండ ప్రాజెక్టు సాధనకై ఉదయగిరిలోని కోట్నీస్ వైద్యశాల ఆవరణలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా వెలిగొండ సాధనకు చైతన్య ప్రచార వేదిక నిర్మాణం పేరుతో కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో వచ్చే నెలలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అఖిలపక్ష సమావేశాలు నిర్వహించాలని తీర్మానించారు. వెలిగొండ సాధన కమిటీ నేతలు దస్తగిరిఅహ్మద్, నారాయణరెడ్డి ఫడ్స్ రమణయ్య, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



సోమశిల: అనంతసాగరంలోని ఆస్థాన ఏ యూసుఫియాకు సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను నెల్లూరులోని నివాసంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ హాజీ అబ్దుల్ అజీజ్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అబ్దుల్‌అజీజ్‌ను దర్గా పీఠాధిపతి సయ్యద్ నజీర్ సాహెబ్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో షేక్ ఖలీల్‌అహ్మద్, జిల్లా ఆవాజ్ కమిటీ సభ్యులు సయ్యద్ అన్సర్, శిష్యబృందం, తదితరులు పాల్గొన్నారు.

పంట బీమాను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఉద్యాన అధికారి సాహుల్

వింజమూరు(ఉదయగిరి): ప్రభుత్వం ఉద్యాన పంట మామిడికి సంబంధించి కొత్తగా పునర్ వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని తీసుకొచ్చిందని వింజమూరు ఉద్యాన అధికారి సాహుల్ తెలిపారు. వింజమూరులోని ఉద్యానశాఖ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 31లోగా ఎకరాకు రూ.2,250 ప్రీమియాన్ని ఆన్‌లైన్ ఇంటర్నెట్ కేంద్రాలు, మీసేవ, సచివాలయాల్లో చెల్లించి బీమాను పొందవచ్చని తెలిపారు. వాతావరణంలో వచ్చిన మార్పులు, అతివృష్టి, అనావృష్టితో మామిడి పంట దెబ్బతింటే ఎకరాకు రూ.45 వేలు నష్టపరిహారాన్ని బీమా కంపెనీలు అందజేస్తాయని వివరించారు. మండల యూనిట్‌గా అమలు చేసే బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే వరితో పాటు ఇతర అపరాల పైర్లకు బీమా గడువు ఈ 31తో ముగియనున్నట్లు తెలిపారు.

అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే చర్యలు


మన గ్రోమోర్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ దేవసేన

ఆత్మకూరురూరల్: ఎరువులను ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు ఏడీఏ దేవసేన వ్యాపారులను హెచ్చరించారు. పట్టణంలోని గ్రోమోర్ రైతుసేవా కేంద్రం, సిండికేట్ ఫార్మర్స్ సొసైటీలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లను తనిఖీ చేసి నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఆత్మకూరు మండలంలో 50 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉందని తెలిపారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించినా, ఇతర ఎరువులు, పరుగు మందులతో లింకుపెట్టి యూరియాను విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యత ఇచ్చి ఎరువులు అందజేయాలని ఆదేశించారు. ఆమె వెంట ఏఓ కిషోర్‌బాబు ఉన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ


హెల్మెట్లు ధరించి ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

సంగం: ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్‌ను ధరించాలని సంగం సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ సూచించారు. సంగంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణపై సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలపై పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా సీఐ వేమారెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో తలకు బలమైన గాయాలవడంతోనే ద్విచక్ర వాహనచోదకులు ఎక్కువగా మరణిస్తున్నారన్నారు. హెల్మెట్‌ను ధరించడం వల్ల ప్రాణాలను రక్షించుకోవచ్చని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, లేకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలను ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎస్సై జాకీర్‌బాషా, సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని రైతుల వినతి


ఏఓకు వినతిపత్రాలు అందజేస్తున్న రైతులు

ఆత్మకూరు: శ్రీకాళహస్తి– నడికుడి రైల్వేలైన్ కోసం సేకరించిన భూములకు సంబంధించిన పరిహారం విషయంలో తమకు న్యాయం చేయాలని మర్రిపాడు, చేజర్ల మండలాలకు చెందిన బాధిత రైతులు కోరారు. ఈ మేరకు ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఏఓ ఎం నిరంజన్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేలైన్ కోసం సేకరించిన తమ భూములకు సంబంధించిన పరిహారం పంపిణీ విషయంలో అవకతవకలు చోటు చేసుకున్నాయని, వాటిని పరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా వివిధ సమస్యలపై 8 అర్జీలు అందినట్లు ఏఓ తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా ఉపాధి పనులు

చేజర్ల: మండలంలోని బోడిపాడులో నిబంధనలకు విరుద్ధంగా ఉపాధి పనులు చేపడుతున్నారు. గ్రామసభలో ఓ చోట పనులు చేపట్టాలని తీర్మానిస్తే ఉపాధి సిబ్బంది మరో చోట పనులు చేయిస్తున్నారు. కొన్ని పనులను చేపట్టకుండానే గతేడాది చేపట్టిన వాటినే చూపుతూ అవినీతికి పాల్పడుతున్నారు. ఈ విషయమై మండలాధికారులకు ఫిర్యాదు చేసినా చేతివాటానికి అలవాటు పడి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బోడిపాడులో ఉపాధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఇటీవల గ్రామసభలో పంట కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని తీర్మానించారు. ఈ మేరకు పంట కాలువల్లో పూడికతీత పనులను చేయించాల్సి ఉన్నా క్షేత్ర సహాయకురాలు హజరత్తమ్మ అందుకు విరుద్ధంగా మరోచోట పనులు చేయిస్తున్నారు. కొన్ని పనులను చేపట్టకుండానే గతేడాది చేసిన పనులనే చూపుతూ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సుమారు రూ.40వేల నుంచి రూ.50 వేల వరకు అవినీతికి పాల్పడినట్లుగా గ్రామస్తులు చెబుతున్నారు. గతంలోనూ క్షేత్రసహాయకురాలు అవకతవతకలకు పాల్పడగా అధికారులు విచారణ జరిపి సస్పెండ్ చేశారు. అయితే కోర్టు ద్వారా స్టే తెచ్చుకుని విధుల్లో కొనసాగుతోంది. అయినా క్షేత్ర సహాయకురాలు తన పనితీరును మార్చుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి పనుల్లో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపి నిధులను దుర్వినియోగం కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఏపీఓ వెంకటేశ్వర్లును సంప్రదించగా గ్రామసభలో తీర్మానించిన చోటే పంట కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారన్నారు. ప్రతిపాదించిన చోటు కాకుండా వేరే చోట చేశారనేది అవాస్తవమని తెలిపారు.

ఘనంగా గణిత దినోత్సవం

ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి ప్రిన్సిపల్ ఎల్ నారాయణస్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరి నిజ జీవితంలో గణితం పాత్రను వివరించారు. రామానుజన్ గణిత సేవలను విద్యార్థులు గుర్తుంచుకుని ఆయన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలన్నారు. వైస్‌ప్రిన్సిపల్ ఏ నరసింహులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పక్కాగా భూముల సర్వే చేపట్టండి

చేజర్ల: పెళ్లేరులో భూముల రీసర్వేను మళ్లీ పక్కాగా చేపట్టాలని ఆర్డీఓ బీ పావని అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె పెళ్లేరులో పర్యటించి భూసమస్యలను పరిశీలించారు. గతంలో చేపట్టిన రీసర్వేలో జరిగిన తప్పులను సవరించేందుకు మళ్లీ రైతుల సమక్షంలో పక్కాగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీఓ వెంట ఏడీ నాగేశ్వర్, తహసీల్దార్ మురళి, డీటీ మస్తానయ్య, సర్వేయర్ రాధాకృష్ణ ఉన్నారు.

హడలెత్తిస్తున్న వీధికుక్కలు


రైల్వేస్టేషన్ రోడ్డులో వీధి కుక్కల స్వైరవిహారం

కావలి: పట్టణంలో వీధి కుక్కలు హడలెత్తిస్తున్నాయి. వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ దాడి చేస్తుండడంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు బెంబేలెత్తిపోతున్నారు. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంపై పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముమ్మరంగా వరినాట్లు



కావలి: కావలి నియోజకవర్గంలో రబీ సాగు పనులు జోరందుకున్నాయి. వర్షాలు తెరిపివ్వడంతో రైతులు సాగు పనులను ముమ్మరం చేశారు. వర్షాలకు పొలాల్లో చేరిన నీటితో కయ్యలను దమ్ము చేసి నాట్లు వేస్తున్నారు. దీంతో వరి నారు తీత, నాట్లు వేసే పనులకు కూలీలకు డిమాండ్ నెలకొంది.

కేజ్‌వీల్స్‌తో రోడ్లు గుల్ల



చేజర్ల: ట్రాక్టర్ల కేజ్‌వీల్స్ కారణంగా రోడ్లు దెబ్బతింటున్నాయి. ప్రస్తుతం మండలంలో రబీ సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పొలాలను దమ్ము చేసేందుకు వినియోగించే కేజ్‌వీల్స్‌ను ట్రాక్టర్లకు తగిలించుకుని రైతులు రోడ్లపై వెళ్తున్నారు. పొలాల వద్ద కేజ్‌వీల్స్‌ను తగిలించుకోవాల్సి ఉండగా రైతులు ఇళ్ల వద్దనే తగిలించుకుని వెళ్తుండడంతో రోడ్డుపై గీతలు పడి దెబ్బతింటున్నాయి. అధికారులు స్పందించి రోడ్లపై కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు తిరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- కావలి వన్ టౌన్ సీఐ ఎండీ ఫిరోజ్


సీఐ ఎండీ ఫిరోజ్

కావలి: ఇళ్లలో దొంగతనాలను నివారించేందుకు లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్) సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కావలి వన్ టౌన్ సీఐ ఎండీ ఫిరోజ్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. క్రిస్మస్, సంక్రాంతి సెలవుల్లో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందన్నారు. ఊర్లకు వెళ్లే సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయవద్దని సూచించారు. ఇళ్లలో విలువైన వస్తువులు, నగదును ఉంచవద్దని తెలిపారు. బంధువులు లేదా బ్యాంకు లాకర్లలో జాగ్రత్తగా భద్రపరుచుకుని వెళ్లాలని సూచించారు. ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లే వారు ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ద్వారా లేదా 94407 96312 నంబర్‌ను సంప్రదిస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను అందజేస్తామన్నారు. ఇళ్ల వద్ద ప్రత్యేకంగా కెమెరాలను అమర్చి నిఘా ఉంచుతామని తెలిపారు. ఇంట్లో ఎలాంటి అనుమానాస్పద కదలికలు కనిపించినా వెంటనే ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరా ద్వారా కమాండ్ కంట్రోల్‌కు సమాచారం అందుతుందని తెలిపారు. వెంటనే పోలీసులు మీ ఇంటి వద్దకు చేరుకుని దొంగలను పట్టుకుంటారని వివరించారు. పట్టణంలో నేరాలను అదుపు చేయడానికి రాత్రి గస్తీని ముమ్మరం చేసినట్లు తెలిపారు. పట్టణంలో ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానాస్పదమైన వ్యక్తులు తారసపడితే వెంటనే 94407 96312 లేదా డయల్ 100,112 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

ప్రమాదాలకు కారణమవుతున్న పశువులు



చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లిలో మెయిన్‌రోడ్డుపై పశువులు తిష్టవేస్తున్నాయి. ఆవులను వాటి యజమానులు కట్టేయకుండా వదిలేస్తున్నారు. దీంతో దాదాపు 40 నుంచి 60 ఆవులు రోడ్డుపై సంచరిస్తున్నాయి. ఇటీవల పశువుల కారణంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురువుతున్నారన్నారు. మరోవైపు ఆవులను వాహనదారులు తొక్కించుకుని వెళ్తుండడంతో మూగజీవాలు గాయాలపాలవుతున్నాయి. ఇటీవల ఓ ఆవుకు కాలు విరిగింది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి గోవులను రోడ్లపైకి వదిలేయకుండా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తరలింపు



అనుమసముద్రంపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోతున్నారు. ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారు. ఇసుక, గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా గత రెండ్రోజుల నుంచి హసనాపురంలోని తిప్ప నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. ప్రైవేట్ లేఅవుట్లు, ఇతర నిర్మాణాలకు తరలిస్తున్నారు. అధికారులకు తెలిసినా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అధికారులు డుమ్మా


ఉదయం 11 గంటలకు తహసీల్దార్ మాత్రమే హాజరైన దృశ్యం

జలదంకి: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అధికారులు డుమ్మా కొట్టారు. ప్రతి సోమవారం జరిగే ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలి. తమ శాఖల పరంగా ప్రజలు అందజేసే అర్జీలను స్వీకరించాలి. అయితే ఉదయం 11 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రమీల ఒక్కరే కనిపించారు. మండల పరిషత్ కార్యాలయంలోనూ ఎంఈఓ, ఏపీఓ, ఏపీఎంలు మాత్రమే కనిపించారు. మిగిలిన శాఖల అధికారులు హాజరు కాలేదు. దీంతో తమ సమస్యలను విన్నవించుకుందామని వచ్చిన అర్జీదారులు ఉసూరుమంటూ వెనుదిరిగారు.

షార్ట్‌సర్క్యూట్‌తో లారీ దగ్ధం


దగ్ధమవుతున్న లారీ


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కావలి: లారీలో షార్ట్‌సర్క్యూట్ చోటు చేసుకుని దగ్ధమైన ఘటన దగదర్తి మండల పరిధిలో చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారిపై సోమవారం రాత్రి చోటు చేసుకుంది. దగదర్తి ఎస్సై జంపాని కుమార్ తెలిపిన వివరాల మేరకు.. హర్యానా నుంచి పాండిచ్చేరికి కాటన్ మిల్లుకు చెందిన యంత్రాలతో వెళ్తున్న లారీలో అల్లూరు రోడ్డు వద్దకు చేరుకోగానే షార్ట్‌సర్క్యూట్ చోటుచేసుకుని మంటలు చెలరేగాయి. దీంతో డ్రైవర్ అప్రమత్తమై లారీని రోడ్డు పక్కన నిలిపి కిందకు దిగేశారు. మంటలు భారీగా ఎగిసి పడడంతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న దగదర్తి ఎస్సై తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందిని రప్పించి మంటలను ఆర్పారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.